# వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

శుక్రవారం 03 మార్చి 2023

## వన్యప్రాణి కణతి మృతి



**సిద్దవటం, మార్చి 2, ప్రభాతవార్త:**

సిద్ధవటం గ్రామ పంచాయతీ నలందా స్కూలు పరిసర మిట్ట ప్రాంతాల్లో వన్యప్రాణి కణతి సంచరిస్తున్నట్లు గ్రామస్థులు ఫారెస్ట్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో ఆ ప్రాంతంలో ఉన్న వన్యప్రాణి కణతి పడి ఉండడంతో వన్యప్రాణిని కాపాడేందుకు దాహాన్ని తీర్చేందుకు ప్రయత్నించిన కొద్ది సేపటికే మృత్యువాత పడింది. ఆ ప్రాంతానికి సిద్దవటం ఫారెస్ట్ రేంజర్ ప్రసాద్ ఆధ్వర్యంలో డిప్యూటీ రేంజర్ ఓబులేసు మరియు సిబ్బంది వాహనంలో సిద్దవటం పశువైద్యశాలకు తీసుకెళ్లి పంచనామ డా.సుబ్బరాయుడు ఆధ్వర్యంలో జరిగింది. వన్యప్రాణి కణతి పంచనామా రిపోర్టు వచ్చాక పూర్తి విషయాలు తెలియజేస్తామని ఫారెస్ట్ రేంజర్ ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజర్ ఓబులేసు, ఫారెస్ట్ సిబ్బంది, వెటర్నరీ సిబ్బంది పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన సబ్‌కలెక్టర్ అహ్మద్‌ఖాన్

**నందలూరు, మార్చి 2 ప్రభాతవార్త**

నందలూరు మండలంలో ఎమ్మెల్సి పోలింగ్ కేంద్రాలను రాజంపేట సబ్‌కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 13న జరిగే గ్రాడ్యుయేట్, టీచర్ల ఎమ్మెల్సి ఎన్నికలకు కేటాయించిన ఉర్దు ఉన్నత పాఠశాలను మండల తహశిల్దారు ఉదయ్‌శంకర్‌రాజుతో కలిసి పరిశీలించారు. ఓటు వేసేందుకు వచ్చినవారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని తెలిపారు. సపరేటుగా బ్రాకెట్లు, మంచినీరు ఉండేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు మోహన్‌కృష్ణ, విఆర్ఒ రాఘవ, ఎఎస్ఐ శంకర్‌నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్

# నాగుల చెరువు ఆక్రమణపై స్పందించని అధికారులు

**కోర్టు ఉత్తర్వులు బేఖాతరు..!**

**సీఎం పేషీ నుండి ఆదేశాలు వచ్చినా నిర్లక్ష్యం**

**పట్టించుకోని నీటి పారుదల శాఖ అధికారులు**

**రోజు రోజుకూ పెరిగిపోతున్న నాగుల చెరువు ఆక్రమణ**

**నాగుల చెరువు సుందరీకరణగా మారేదెన్నడో ?**



నాగుల చెరువు.

**బద్వేలు, మార్చి 02 ప్రభాతవార్త :**

పట్టణ నడిబొడ్డన ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఇచ్చే నాగుల చెరువు ఆక్రమణలపై కొన్నేళ్లుగా కోర్టులు, ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేస్తున్నా పట్టించుకునే నాధుడే కరువయ్యారు. నాగుల చెరువు చుట్టూ ఆక్రమణలు జరుగుతున్నాయని, వెంటనే విస్తీర్ణాన్ని పరిశీలించి హద్దులు ఏర్పాటు చేయాలని గతంలో ఎన్నో మార్లు ఉన్నతాధికారుల నుండి స్థానిక అధికారులకు ఆదేశాలు వచ్చాయి. కానీ ఫలితం లేకుండా పోతోంది. ఏ అధికారి నాగుల చెరువు గురించి పట్టించుకోక పోగా ఆక్రమణలు జరుగుతున్నా చూస్తూ ఉండడమే విడ్డూరం. నాగుల చెరువు సరిహద్దుల చుట్టూ ఆక్రమణలు జరిగాయని గతంలో నీటి సంఘం నాయకులు కోర్టుకు వెళ్ళిన సంఘటనలు కూడా ఉన్నాయి. 2020 లో కోర్టు నాగుల చెరువుకు హద్దులు ఏర్పాటు చేయాలని ఉత్తర్వులు కూడా జారీ చేసింది. కానీ నీటి పారుదల శాఖ అధికారులు పట్టించుకోలేదు. మళ్ళీ విన్నవించుకోవడంతో ముఖ్యమంత్రి పేషీ నుండి రెవిన్యూ శాఖ అడిషనల్ సెక్రటరి 19.8.2021 నాడు నాగుల చెరువుకు హద్దులు ఏర్పాటు చేయాలని ఉత్తర్వులు ఇచ్చారు. ఇలా కోర్టు ఉత్తర్వులు, ముఖ్యమంత్రి పేషీ ఉత్తర్వులు వచ్చినప్పటికీ అన్నింటినీ బేఖాతరు చేశారు. ఇంత రెవిన్యూ వ్యవస్థ, నీటి పారుదల శాఖ వ్యవస్థ ఉండి కూడా ఆక్రమణలపై చర్యలు తీసుకోకపోవడం నాగుల చెరువు ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేయకపోవడం శోచనీయం. ఇంత జరుగుతున్నా అధికారులు చూస్తున్నారు తప్ప ఒక్కరు కూడా చర్యలు తీసుకున్న పాపాన పోలేదు. ప్రధానంగా నాగుల చెరువు బద్వేలు పరిధిలో ఉన్నప్పటికీ సర్వే నెంబర్ 1153, 1154, 1151, 1157/2, 1158, 1168/2 లలో కబ్జాలు చేసి ఇష్టానుసారంగా నాగుల చెరువును అనుభవిస్తున్నారు కబ్జాదారులు. వీటన్నిటిపైన చర్యలు తీసుకొని నోటీసులు జారీ చేసి హద్దులు ఏర్పాటు చేయాలని పదే పదే చెబుతున్నా ఏ ఒక్కరూ పట్టించుకోవడం లేదు. రెవిన్యూ వ్యవస్థలో క్రింది స్థాయి నుండి అధికారుల వరకూ ఎంతో మంది పనిచేస్తున్నారు. నీటి పారుదల శాఖలో కూడా ఎంతో మంది సిబ్బంది ఉన్నప్పటికీ ఒక్కరు కూడా నాగుల చెరువు హద్దుల దగ్గరికి వెళ్ళిన దాఖలాలు లేవు. కేవలం నామమాత్రంగా సిబ్బంది మాత్రమే వెళుతున్నారు తప్ప, అధికారులు పరిశీలించిన దాఖలాలు లేవు. ఇదిలా ఉంటే కబ్జాదారులకు కొంత మంది సిబ్బంది సహకరించడమే గాక నీటి పారుదల శాఖలో ఉండే ఒక అధికారి కబ్జాదారుల నుండి మామూళ్ళు కూడా తీసుకున్నారని సమాచారం. అందుకే కబ్జాదారులు మమ్మల్ని ఏమీ చేయలేరనే ధైర్యంతో యధావిధంగా కబ్జాలు కొనసాగిస్తూనే ఉన్నారు. క్రిష్ణ మందిరం ప్రక్కన కబ్జాతో పాటు అటు ప్రక్కనే చెరువు స్థలంలో సిమెంట్ దిమ్మెలు, బ్రిక్స్ వ్యాపారం సాగిస్తున్నారు. మరో పక్క నిర్మాణాలు కూడా చేపట్టారు. ఇలా ఒక హద్దులోనే ఇవి జరిగాయంటే నాలుగు ప్రక్కలా ఎంత మేరకు కబ్జా జరిగిందో చెప్పనవసరం లేదు. ఇప్పటికైనా అధికారులు నాగుల చెరువుపై దృష్టి పెట్టి సుందరీకరణగా మార్చాలని పలువురు ప్రజలు కోరుతున్నారు.

# ఫర్టిలైజర్ షాపుల్లో లైసెన్స్ ఒకరిది అమ్మేది ఇంకొకరు





**రాయచోటి.మార్చి02 ప్రభాతవార్త**

రాయచోటి నియోజకవర్గంలోని రామాపురం, లక్కిరెడ్డిపల్లి, గాలివీడు, సుండుపల్లి మండలాల్లో రైతులు వ్యవసాయంపై ఆధార పడి జీవిస్తున్నారు. పైరు ఎదుగుదలకు వేసే ఎరువులు వాటిని విక్ర యించే ఫర్టిలైజర్స్ షాపు లైసెన్స్ ఒకరి పేరు ఉంటే దుకాణంలో అమ్మకం దారులు మరొకరు ఉంటున్నారు. దీంతో ఎరువులు మందులపై అవగాహన లేని వారు ఇచ్చినవే రైతులు వాడడం వల్ల రైతులకు ఆశించిన ఫలితం శూన్యం. ఎరువులు మందుల ఫర్టిలైజర్ దుకాణాల్లో లైసెన్స్ పొందిన వ్యక్తులు కాకుండా వేరు వాళ్లు నడిపిస్తున్నట్లు తెలుస్తోంది. కనీస అర్హత లేకపోయినా ఎరువులు శాస్త్రీయ నామాలు తెలియకున్నా, ప్రమాణాలు పాటించకుండా ఇష్టానుసారంగా రైతులకు అమ్ముతున్నారు. పట్టణాలతో పాటు గ్రామాల్లోను మండలాలను విరివిగా ఫర్టిలైజర్ దుకాణాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. డిగ్రీ అర్హత బి ఎస్సీ అగ్రికల్చర్ రసాయన శాస్త్రీయ అర్హత సాధించిన వారికి ఫర్టిలైజర్ దుకాణం లైసెన్స్ ఇస్తారు. డిగ్రీ ద్వారా లైసెన్స్ పొందితే డీలర్ ఎరువులు విత్తనాలు ఇతర రసాయన మందులు దుకాణాలు నిర్వహణకు అవకాశం ఉంటుంది. రసాయన మందులు అమ్మాలంటే తప్పనిసరిగా ఎవరు సర్టిఫికేట్ ద్వారా లైసెన్స్ పొందారు వారిని టెక్నికల్ పర్సన్‌గా దుకాణంలో ఉంచాల్సి ఉంటుంది. దుకాణాలు తనిఖీ సమయంలో టెక్నికల్ పర్సన్ లేకుండా విక్రయాలు జరిపితే 8ఎ యాక్ట్ కింద కేసు నమోదు చేయవచ్చు. 80 నుంచి 90 శాతం దుకాణాల్లో టెక్నికల్ పర్సన్ లేకుండానే ఇక్క డ సాగుతున్నట్లు తెలుస్తోంది. సర్టిఫికేట్ కలిగిన వ్యక్తులు ఎక్కడో ఉంటారు. ఇక్కడ కనీసం 10వ తరగతి పాస్ కాని వారు కూడా దుకాణాలు నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. దీంతో ఆయా కంపెనీల సేల్స్ మేనేజర్లు సిబ్బంది చెప్పిన రసాయన మందులు రైతులకు అంటకడుతున్నారు. పంటలపై ముందుచూపు లేని రైతు లు నష్టపోతున్నారు. ఎలాంటి వాతావరణంలో మందు పిచికారి చేయాలి దాని ప్రభావం ఎలా ఉంటుంది తదితర అంశాలపై అవ గాహన రైతులకు తెలయజేయడం లేదు. వ్యవసాయ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తుండడంతో దుకాణాదారులకు అడ్డు లేకుండా పోతోంది. అర్హత కలిగిన సర్టిఫికేట్‌లు పేరిట లైసెన్స్‌లు పొంది పట్టణంలో నిర్వహిస్తున్నారు. సర్టిఫికేట్ కలిగిన వారు లేకపో యినా వారి సర్టిఫికేట్‌లుతో దుకాణాల లైసెన్స్‌లు కొనసాగుతున్నాయి. వాటిని పర్యవేక్షించాల్సిన అధికారులువ్యవసాయ అధికారులు నామమాత్రంగా పరిశీలిస్తున్నారు. దీంతో పాటు ప్రతి డీలర్ డిప్లమా ఇన్ అగ్రికల్చర్ టూర్ ఎక్స్టెన్షన్ సర్వీస్ ఆఫ్ ఇన్‌పుట్ కింద శాస్త్రవేత్తలు రిటైర్డ్ వ్యవసాయ అధికారులు ద్వారా 48 రోజులు పాటు శిక్షణా తరగతులు నిర్వహిస్తారు. ఈ శిక్షణా తరగతులు నామామా త్రంగా కొందరు మామూలుగానే సర్టిఫికేట్ పొందుతున్నట్లు తెలు స్తోంది. శిక్షణకు హాజరైన వారికి 40 వేలు సర్టిఫికేట్ పొందడానికి మరో 20వేలు తీసుకుంటున్నట్లు డీలర్‌లు చర్చించుకుంటున్నారు. వ్యవసాయ అధికారులు శాస్త్రవేత్తలతో పేస్టిసైడ్స్ పై అవగాహన సదస్సులు లేక రసాయన శాస్త్ర నామాలు దాని ప్రభావం విని యో గం తెలియకపోయినా విక్రయాలు సాగిస్తున్నారు. దుకాణాలు ముందు విత్తన ఎరువులు తదితర స్టాక్ బోర్డులు ఏర్పాటు చేయడం లేదు రైతులకు ఎరువు రసాయన మందులకు సరైన రసీదు ఇవ్వడం లే దు. తెల్లకాగితంపై రైతు పేరు కొనుగోలు చేసిన తేదీ ధర వేసి ఇస్తు న్నట్లు విమర్శలవు వస్తున్నాయి. ఎక్స్పైర్ తేదీ కంపెనీ బ్యాడ్జీ నంబర్ తదితర వివరాలతో డీలర్ పేరుతో ఉన్న రసీదు అందించాల్సి ఉంటుంది. అమాయక రైతులను ఆసరాగా చేసుకుని ఇష్టాను సారంగా కంపెనీలు ఆఫర్లకు ఆశపడి కట్టబెడుతున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు.

## వాహనాల తనిఖీలో 30 లక్షలు నగదు పట్టుకొన్న పోలీసులు



పోలిచెరువు కట్టపై కారులో పట్టుకొన్న నగదుతో సిఐ నరసింహారావు

**రాజంపేట అర్బన్, మార్చి 2 ప్రభాతవార్త**

ఎమ్మెల్సి ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు 30 లక్షల నగదును పట్టుకొన్నారు. పోలిచెరువు కట్టపై రాజంపేట అర్బన సిఐ సిబ్బందితో కలిసి గురువారం వాహనాలు తనిఖీ చేస్తుండగా తమిళనాడు రిజిస్ట్రేషన్‌తో కలిగిన టిఎన్05సిసి 7799 నంబరును తనిఖీ చేశారు. కారులో 30 లక్షల నగదు లభించింది. చెన్నైకి చెందిన వెంకటరమణ, మరో ముగ్గురు కలిసి రాజంపేటలో స్థలం కొనడానికి సొమ్ము తీసుకొచ్చినట్లు తెలిపారు. సరైన పత్రాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకొన్న సొమ్మును పంచనామ నిర్వహించి జిల్లా కలెక్టర్ నియమించిన ఫ్లైయింగ్‌స్క్వాడ్‌కు అప్పగించినట్లు సిఐ నరసింహారావు తెలిపారు.

## రెడ్డివారికుంటలో కొనసాగుతున్న ఆక్రమణలు

**- అధికారుల హెచ్చరికలు బేఖాతరు**

**ఓబులవారిపల్లె, మార్చి 2, ప్రభాతవార్త:**



ఓబులవారిపల్లె మండలం పెద్దఓరంపాడు రెవెన్యూ పొలం రెడ్డివారికుంటలో ఆక్రమణల జోరు కొనసాగుతోంది. ఇటీవల రెవెన్యూ అధికారులు ఆక్రమించిన భూముల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. అదే సమయంలో అధికారులు లేని సమయంలో ఆ బోర్డులను సైతం లెక్క చేయకుండా బేఖాతరు చేసి ప్రభుత్వ భూములను యథేచ్ఛగా మమ్మల్ని ఎవరు ఆపేదెంటూ ఆక్రమించి షెడ్లు, చదును చేయడం లాంటి పనులు కొనసాగిస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ భూములు ఆక్రమించి అన్యాక్రాంతం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్నా అవేమీ మాకు పట్టవన్నట్లు కొందరు భూ కబ్జాదారులు భూములు ఆక్రమిస్తూ చెరువులు, కుంటలను అనుభవిస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. అధికారుల మాటలు కూడా లెక్క చేయకుండా భూములు ఆక్రమిస్తున్నారని అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు, రైతులు కోరుతున్నారు. ఈ భూ ఆక్రమణలపై తహసీల్దారు పీర్‌మున్నీని వివరణ కోరగా ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే, హెచ్చరిక బోర్డులు తీసివేసిన వారిపై పై అధికారులకు నివేదికలు పంపి చట్టబద్ధమైన చర్యలు తీసుకొని కేసులు నమోదు చేయిస్తామని ఆమె తెలిపారు.

## ఆక్రమణపై అధికారులు చర్యలు

**వార్తకు స్పందన**

**ఖాజీపేట మార్చి 2, ప్రభాతవార్త**



ఖాజీపేట పుల్లూరు పంచా యతీలో బ్రిటిష్ కాలం నాటి పిడబ్ల్యూడీ బంగ్లా ఆక్రమణకు గురైంది. దీనితో ఆక్రమణకు గురైన పిడబ్ల్యుడి బంగ్లా అనే శీర్షికన 'వార్త' లో కథనం వెలుడిన విషయం పాఠకులకు విధితమే ఈ మేరకు అధికారులు బంగ్లాను సందర్శించి వాహనాలను ఖాళీ చేపించి ఇక్కడ వాహనాలు పార్కింగ్, మరియు ఇక్కడ గేదెలను కట్టివేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పి ఎవరు వెళ్లకుండా కంప కూడా వేశారు సంబంధిత అధికారులు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

## హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించండి..ప్రాణాలు కాపాడుకోండి..

**- జిల్లా వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ ప్రారంభం - హెల్మెట్ లేని కేసులు 212, సీట్ బెల్ట్ ధరించని వారిపై 52 కేసులు**

**- జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్**

**కడప క్రైం, మార్చి 2, ప్రభాతవార్త:**

హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పేర్కొన్నారు. హెల్మెట్, సీటు బెల్టు ధరించడం వల్ల విలువైన ప్రాణాలను సురక్షితంగా ఉంచుకోవచ్చన్నారు. జిల్లా వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ చేపట్టామని ఎస్పీ తెలిపారు. గురువారం పోలీసులు చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌పై పత్రికా ప్రకటన విడుదల చేశారు. గ్రామాల సందర్శన సమయంలో నిర్వహించే గ్రామ సభల్లో ఫ్యాక్షన్, మట్కా, సైబర్ నేరాలు తదితర అంశాలతో పాటు రోడ్డు భద్రతపై ప్రజలను చైతన్యం చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. రోడ్డు భద్రతను దృష్టిలో ఉంచుకొని జిల్లాలో పక్కాగా ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి. కార్లు, జీపులు నడిపే వారు సీటు బెల్టు తప్పని సరిగా ధరించాలని తెలిపారు. వేగ నియంత్రణ, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై చర్యలు, మొబైల్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. ఓవర్ లోడింగ్‌తో వెళ్లే ఆటోలపై కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. రోడ్డు భద్రతపై స్టిక్కర్లు, పోస్టర్లు ముద్రించి పట్టణాలతో పాటు గ్రామాల్లో అతికిస్తూ ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలను, ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదం జరగకుండా చూడాలన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీసు స్టేషన్ పరిధిలో రహదారి భద్రతా వారోత్సవాల నేపథ్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు అందరూ తమ వంతు సామాజిక బాధ్యతగా భావించి కృషి చేయాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. జిల్లాలో పోలీసులు చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా నిబంధనలు ఉల్లంఘించి వాహనాలు నడిపిన వారిపై మొత్తం కేసులు 264 నమోదు చేశారు. ఇందులో ప్రధానంగా హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాలు నడిపిన చోదకులపై 212 కేసులు, సీటు బెల్టు ధరించకుండా వెళ్తున్న కార్లు, జీపులు, ఇతర వాహనాల చోదకులు 52 కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ అన్బురాజన్ తెలిపారు.

# బాల్యవివాహాలు చట్టరిత్యా నేరం

**-బాల్యవివాహాలు జరిగితే ఎఫ్ఐఆర్ నమోదు**

**బాల్యవివాహాల నిర్మూలనకు హెచ్‌వోడిలు ప్రత్యేక చర్యలు చేపట్టాలి**

**-కలెక్టర్ గిరీషా పిఎస్**

**రాయచోటి.మార్చి02 ప్రభాతవార్త**



బాల్యవివాహాలు చట్టరిత్యా నేరమని బాల్యవివాహాలు జరిగితే ఎఫ్ఐఆర్ నమోదు చేసి కఠినంగా శిక్షించాలని జిల్లా కలెక్టర్ గిరీష పిఎస్ సంబందిత అధికారులకు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ వీడియోకాన్ఫరెన్స్ హాల్ నందు స్త్రీ శిశు సంక్షేమ శాఖ వారి ఆద్వర్యంలో బాల్యవివాహాల నిర్మూలనపై జిల్లా స్థాయి కో ఆర్డినేషన్ కమిటి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కల్టెర్ మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరిత్యా నేరమని, బాల్య వివాహాలను ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఎక్కడైనా బాల్యవివాహాలు జరిగనట్లయితే ఎఫ్ఐఆర్ నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. బాల్యవివాహాల నిర్మూలనకు టోల్ ఫ్రీ నంబర్ 1098కు ఫోన్ చేసి సహకరించాలన్నారు. సచివాలయాల పరిధిలోని మహిళా పోలీస్‌లు, పంచాయతీ సెక్రటరీలు, ఏఎన్ఎంలు, బాల్యవివాహాల వల్ల జరిగే అనార్ధలు గురించి ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలన్నారు. మన దేశానికి స్వాత ంత్ర్యం వచ్చి 75 ఏళ్ల పూర్తయినప్పటికి ఇంకా బాల్య వివాహాలు జరగడం చాలా బాధాకరమన్నారు. చాలా పాఠశాలల్లో కేవలం పెళ్లి కోసమే అమ్మాయిలు డ్రాప్ అవుట్ అవుతుంటారని అమ్మాయిలు డ్రాప్ అవుట్ లీస్ట్‌పై ఎడ్యుకేషన్ అసిస్టెంట్‌లు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆర్డివోలు, తహశీల్దార్‌లు, ఎంపిడివోలు, ఐసిడిఎస్, వైద్యాధికారిలు, విద్యాశాఖ అధికారులు సమన్వయంతో ప్రతి నెల క్రమం తప్పకుండా డివిజన్ స్థాయి, మండల స్థాయి గ్రామస్థాయిలో బాల్యవివాహాల నిర్మూలనకు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమీషన్ సభ్యురాలు లక్ష్మీదేవి మాట్లాడుతూ తెలిసి తెలియని చిన్న వయస్సులో బాలికలు వివాహం చేసుకోవడం జీవితంలో ఎదుగుదలకు ఎన్నో రకాలుగా అవరోధం కలిగిస్తుందన్నారు. 18 సంవత్సరాలు లోపు బాలికలకు 21 సంవత్సరాల లోపు అబ్బాయికి వివాహం చేస్తే పెళ్లి కుమారునికి, వారి తల్లిదండ్రులకు పెళ్లిలో పాల్గొనే వారికి రెండు సంవత్సరాలు జైలు శిక్ష, లక్ష రూపాయలు జరిమానా విధించడం జరుగుతుందన్నారు. ఇది బెయిలు లభించని నేరమన్నారు. మైనర్ బాలికను వివాహం చేసుకుని తనతో సంసారం చేసిన భర్తకు ఫోక్సో చట్టం కింద 10 సంవత్సరాలు జైలు శిక్ష కూడా విధించవచ్చనన్నారు.

# ప్రభుత్వ సంక్షేమ పథకాలు పేద ప్రజలకు అందేలా చర్యలు తీసుకోవాలి

**అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై విసి ద్వారా కలెక్టర్లతో సమీక్షించిన**

**రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి జవహర్ రెడ్డి,**

**కడప, మార్చి 2 ప్రభాతవార్త :**



రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల ఫలాలు.. ప్రజలకు సంతృప్తి స్థాయిలో అందాలని, అన్ని రంగాల్లో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించాలని కలెక్టర్ వి.విజయ్ రామరాజు జిల్లా అధికారులను ఆదేశించారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి హౌసింగ్, రెవెన్యూ, వ్యవసాయ అనుబంధ రంగాలు, పిఆర్ అండ్ ఆర్ డి, వివిధ ప్రభుత్వ పథకాల అమలుపై అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో.. రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి డా.జవహర్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ కార్యక్రమానికి.. స్థానిక కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుండి జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు తోపాటు జేసీ సాయికాంత్ వర్మ, సంబందిత అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా విసి ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి డా.జవహర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన నవరత్నాలు పేదలందరికీ ఇళ్ళు పథకంలో భాగంగా జగనన్న కాలనీలలో చేపట్టిన ఇళ్ల నిర్మాణం శరవేగంగా జరగాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సేవలు, సంక్షేమ పథకాలు ప్రజలకు సంతృప్తి స్థాయిలో అందాలనే లక్ష్యం మేరకు అధికారులు నిబద్ధత, బాధ్యతతో పని చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీ సర్వే ముమ్మరంగా జరగాలని అధికారులను ఆదేశించారు.కీలకమైన డ్రోన్ సర్వే, క్షేత్రస్థాయి నిజ నిర్ధారణ, గ్రౌండ్ వాలిడేషన్ వంటి పనులన్నీ చకచకా ముందుకు సాగాలన్నారు. రైతులు సాగు చేసిన పంటలకు సంబంధించి ఈకెవైసి త్వరగా పూర్తి చేయలన్నారు. అమృత్ సరోవర్ పథకంలో చేపట్టిన పనులను ఏప్రిల్ కు పూర్తి చేయాలని ఆదేశించారు. ఉపాధి హామీ పథకంలో కూలీలకు సకాలంలో బిల్లులు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. సచివాలయ బిల్డింగులు, వైయస్సార్ హెల్త్ క్లినిక్, రైతు భరోసా భవన నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఇంకా వివిధ ప్రభుత్వ పథకాల అమలు తదితర అంశాలపై చీఫ్ సెక్రటరీ జిల్లాల కలెక్టర్ లు, జెసిలు, జిల్లా అధికారులకు దిశ నిర్దేశించారు. సిఎస్ విసి ముగిసిన అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సూచనలు, ఆదేశాల మేరకు.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల ఫలాలు.. ప్రజలకు సంతృప్తి స్థాయిలో అందాలని ఆదేశించారు. జిల్లాలో రీ సర్వేను పకడ్బందీగా పూర్తి చేయాలని, జల్ జీవన్ మిషన్ పైన ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. రానున్న వేసవి సీజన్ ను దృష్టిలో ఉంచుకొని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో.. తాగునీటి అవసరాలకు ఎలాంటి కొరత లేకుండా మంచినీటి పథకాలను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. రబీ సీజన్ కు సంబంధించి సాగుచేసిన పంటలకు ఈ క్రాపింగ్, ఈకేవైసీ 100% పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ సూచించారు. గ్రామ సచివాలయాలు, ఆర్.బి.కె, హెల్త్ క్లినిక్ లు స్టేజ్ కన్వర్షన్ మీద ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అన్ని అంశాల్లో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించేందుకు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో.. డిఆర్వో గంగాధర గౌడ్, వ్యవసాయ అనుబంధ శాఖల జిల్లా అధికారులు, సంక్షేమ, సర్వే, ఇంజనీరింగ్ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం అమలు చేస్తున్న సేవలు, సంక్షేమ పథకాలు

# ప్రజలకు సంతృప్తి స్థాయిలో అందాలి

**-జగనన్న హౌసింగ్ కాలనీలో ఇళ్ల నిర్మాణంలో పురోగతి సాధించాలి**

**-రైతులు సాగు చేసిన పంటలకు సంబందించి ఈకేవైసి త్వరగా పూర్తి చేయండి**

**-ఉపాధి హామీ పథకంలో కూలీలకు సకాలంలో బిల్లులు అందేలా చర్యలు తీసుకోవాలి**

**-అధికారులకు ఆదేశించిన చీఫ్ సెక్రటరీ డా.జవహార్‌రెడ్డి**

**రాయచోటి.మార్చి02 ప్రభాతవార్త**



ప్రభుత్వం అమలు చేస్తున్న సేవలు, సంక్షేమ పథకాలు ప్రజలకు సంతృప్తి స్థాయిలో అందాలని చీఫ్ సెక్రటరీ డా.జవహార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం విజయవాడలోని రాష్ట్ర సచివాలయం నుంచి హౌసింగ్, రెవెన్యూ, అగ్రికల్చర్, హర్టీకల్చర్, సిరికల్చర్, అనిమల్ హాస్బండ్రీ, డైరీ డెవలప్‌మెంట్, పిఆర్ అండ్ ఆర్‌డి, వివిధ ప్రభుత్వ పథకాల అమలుపై అన్ని జిల్లాల కలెక్టర్‌లు, జాయింట్ కలెక్టర్‌లుతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చీఫ్ సెక్రటరీ డా.జవహార్‌రెడ్డి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశబెట్టిన నవరత్నాల పేదలందరికి ఇళ్లు పథకంలో భాగంగా జగనన్న కాలనీలలో చేపట్టిన ఇళ్ల నిర్మాణం వేగంగా జరగాలన్నారు. అధికారులు నిబద్ధత, బాద్యతతో పని చేయాలన్నారు. రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూములు రీ సర్వే ముమ్మరంగా జరగాలని అధికారులను ఆదేశించారు. అమృత్ సరోవర్ పథకంలో చేపట్టిన పనులను ఏప్రిల్‌కు పూర్తి చేయాలన్నారు. ఉపాధి హామీ పథకంలో కూలీలకు సకాలంలో బిల్లులు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. సచివాలయ బిల్డింగ్‌లు, వైఎస్సార్ హెల్త్ క్లీనిక్, రైతు భరోసా భవన నిర్మాణాలును త్వంగా పూర్తి చేయాలన్నారు. ఇంకా వివిధ ప్రభుత్వ పథకాలు అమలు తదితర అంశాలపై చీఫ్ సెక్రటరీ జిల్లాల కలెక్టర్ లు జేసిలు, జిల్లా అధికారులకు దిశా నిర్దేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్ గిరీష పిఎస్ మాట్లాడుతూ జిల్లాలో రీ సర్వేను పకడ్బందీగా పూర్తి చేయాలన్నారు. అలాగే జల్‌జీవన్ మిషన్ పైన ప్రత్యేక దృష్టి పెట్టి ఆ పనులను పూర్తి చేయాలన్నారు. రబీ సీజన్ ఈకేవైసీ మీద ప్రత్యేక దృష్టి పెట్టాలని సంబందిత అధికారులను కలెక్టర్ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఏ లక్ష్యమయితే నిర్ణయించిందో ఆలక్ష్యాన్ని సాధించేందుకు కృషి చేయాలన్నారు.

## ఏపిపిఎస్‌సి ద్వారా ఉద్యోగ ఖాళీలు భర్తీ చేయాలి : ఒంటేరు

ప్రొద్దుటూరు అర్బన్, మార్చి 2, ప్రభాతవార్త



యూపీఎస్సీ తరహాలో రాష్ట్రంలో కూడా ఏపీపీఎస్సీ ద్వారా ఖాళీలను క్రమం తప్పకుండా భర్తీ చేయాలని ఒంటేరు శ్రీనివాసులరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రొద్దుటూరులోని గౌతమి ఇంజనీరింగ్ కళాశాలతో పాటు కళాశాలలను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని విశ్వ విద్యా లయాలు, ఇంజనీరింగ్ కళాశాలల్లోని అధ్యాపకుల ఖాళీలతో పాటు ప్రభుత్వ ఇంజనీర్ పోస్టులు కూడా ఎన్నో ఖాళీగా ఉన్నాయన్నారు. ఏపీపీఎస్సీ ద్వారా క్రమం తప్పకుండా ప్రతి ఏటా ఖాళీలను భర్తీ చేసి నిరుద్యోగుల కష్టాలు తీర్చా లన్నారు. ఖాళీల భర్తీ కోసం నిర్దిష్ట షెడ్యూలును రూపొందించి ప్రతి సంవత్సరం దానికి అనుగుణంగా నోటిఫికేషన్లు విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వరుణ్‌కుమార్ రెడ్డి విశ్రాంత ఇంజనీర్ ఎస్వీఎస్ రామ చంద్రారెడ్డి, కొండయ్య విశ్రాంత అధ్యాపకులు కోటా ఓబులరెడ్డి, సంస్కృత అధ్యాపకులు రమణ, ఉపాధ్యాయులు షేక్షావలి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

## మహిళా దినోత్సవం మొల్లమాంబకు అంకితం

ప్రొద్దుటూరు అర్బన్, మార్చి 2, ప్రభాతవార్త



మార్చి 8 వ తేదీ ప్రపంచ వ్యాప్తంగా నిర్వహించే మహిళా దినోత్స వాన్ని మహా కవయిత్రి మొల్లమాంబకు అంకితం చేస్తున్నట్లు మొల్ల సాహితీ పీఠం వ్యవస్థాపక అధ్యక్షులు విద్వాన్, డాక్టర్ గానుగపెంట హనుమంతారావు పేర్కొన్నారు. కార్యక్రమం ప్రొద్దుటూరులోని శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాలలో మహిళా విద్యార్థినులతో నిర్వహిస్తు న్నామన్నారు. కార్యక్రమానికి ప్రముఖ శతావధాని కవి నరాల రామారెడ్డి అధ్యక్షులుగా, ముఖ్య అతిథులుగా పుట్టపర్తి సాహితీపీఠం ప్రధానకార్యదర్శి జింకా సుబ్రమణ్యం, ప్రముఖ ఆడిటర్ సాధుగోపాలకృష్ణ, కళాశాలకరెస్పాండంట్ హరినారాయణ హాజరవుతారు.

**దుర్గాభవానీకి మొల్ల సాహిత్య సేవా పురస్కారం**

ప్రొద్దుటూరుకు చెందిన ఉత్తమ ఉపాధ్యాయిని, పద్య కవయిత్రి శ్రీమతి కోటా దుర్గాభవానికి మహా కవయిత్రి మొల్ల సాహితీ సేవా పురసారం అందజేస్తున్నట్లు తెలిపారు. పురస్కారం కింద నగదు, మొల్ల జ్ఞాపిక, శాలువా, ప్రశంసాపత్రం ప్రధానం చేస్తున్నట్లు ప్రముఖ సాహితీవేత్త విద్వాన్, డా. గానుగ పెంట హనుమంతరావు ప్రకటించారు.

## వందశాతం ఉత్తీర్ణత సాధించాలి : డిఇఒ



చాపాడు మార్చి 2, ప్రభాతవార్త

ఈ ఏడాది పదవ తరగతి పరీక్షలలో 100శాతం ఉత్తీర్ణత సాధిం చాలని జిల్లా విద్యాశాఖ అధికారి చెప్పలి దేవరాజు తెలిపారు. గురువారం మండలంలోని చియ్యపాడు. లక్ష్మీపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థులు ఎటువంటి ఒత్తిడిలకు, ఒడిదుడుకులకు లోను కాకుండా పరీక్షలు ప్రశాంతంగా రాసి 100 శాతం ఉత్తీర్ణ సాధించాలనికోరారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి రవిశంకర్ ఆయా పాఠశాలల ప్రధానాచార్యులు, నరహరిశర్మ. సూర్యనారాయణ పాల్గొన్నారు.

## సర్వసభ్య సమావేశం



ఖాజీపేట మార్చి 2, ప్రభాతవార్త

ఖాజీపేట మండల పరిషత్ కార్యాలయంలో గురు వారం సర్వసభ్య సమావేశం జరిగిం ది. ఈ సందర్భంగా శాసన సభ్యులు మాట్లాడుతూ మండల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రాబోవు వేసవిలో నీటి ఎద్దడి గల ప్రాంతాలను గుర్తించి ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సమావేశంలో ఏపీఐఐసీ డైరెక్టర్ దుగ్గిరెడ్డి గంగాధర్ రెడ్డి, ఎంపీపీ అబూబాకర్ సిద్దిఖ్ మరియు జెడ్ .పి.టి.సి, ఎం.పి.టి.సిలు సర్పంచ్‌లు మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## గ్రావెల్ అక్రమ రవాణాపై వీఆర్ఏకి మెమో

సిద్దవటం, మార్చి 2, ప్రభాతవార్త:

మండల పరిధిలోని శాఖ రాజుపల్లి వీఆర్ఏ వెంకట సుబ్బయ్య తన పరిధిలోని ప్రాంతంలో అక్రమ గ్రావెల్‌కు సహకరిస్తున్నారని మార్చి 1వ తేదీన మెమో జారీ చేయడం జరిగిందని మండల తహసీల్దారు శంకరయ్య విలేకరుల సమావేశంలో తెలిపారు. విధులకు సక్రమంగా హాజరు కాకుండా అందుబాటులో లేకుండా ఉన్నాడని పలుమార్లు హెచ్చరించినా వీఆర్ఏ విధులలో మార్పు రాలే దన్నారు. ప్రభుత్వ స్థలంలో దగ్గరుండి బేస్‌మట్టం అక్రమ నిర్మాణ కట్టడాలకు సహాయ సహకారాలు అందిస్తున్నారని తమ దృష్టికి వచ్చిందని విచారణలో రుజు వు ఉన్నతాధికారులకు నివేదిక పంపించి తగు చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు.


## హత్య చేసిన నిందితుడు కోర్టుకు తరలింపు

తంబళ్లపల్లె, మార్చి 2, ప్రభాతవార్త:

బోరు మోటారు వద్ద సాగునీరు విషయమై సొంత బాబాయ్‌ని హతమార్చిన సంఘటన తంబళ్లపల్లె మండలంలో వెలుగు చూసింది. మండలంలోని గోపిదిన్నె పంచాయతీ కొత్తపల్లికి చెందిన నారాయణరెడ్డి (73) అతని సోదరుడు కుమారుడు నరేందర్‌రెడ్డి(31) గ్రామ సమీపంలో ఉమ్మడి వ్యవసాయ బోరు ఉంది. సాగునీరు మళ్లింపులో ఇరువురికి తగాదాలు ఏర్పడేవి. ఈ నేపథ్యంలో మంగళవారం గ్రామ సవమీపంలోని బండరాయితో నరేందర్‌రెడ్డి తన బాబాయ్‌ని కొట్టి చంపేశాడు. ఈ విషయమై సమాచారం అందుకున్న ములకల చెరువు సీఐ పాదిక్ అలీ, ఎస్సై రామకృష్ణారెడ్డితో సంఘటనా స్థలికి చేరుకొని నరేంద్రరెడ్డిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించమని ఆదేశాలు జారీ చేశారు.

## ఎన్ఎంయూ రాష్ట్ర ఉపాధ్యక్షునిగా పీవీ శివారెడ్డి ఏకగ్రీవం

కడప వైద్యవిభాగం, మార్చి 2, ప్రభాతవార్త:



నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసి యేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షునిగా పల్లె వెంకట శివారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇటీవల విజయవాడలో రాష్ట్ర కమిటీ తీర్మానం చేసి 3వసారి శివారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్ను కున్నట్లు ఎన్ఎంయూఏ కడప జోనల్ సెక్రటరీ సుధాకర్ తెలిపారు. గురువారం శివారెడ్డిని యూనియన్ కార్యాలయంలో సత్కరించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ శివారెడ్డి కడప జోన్‌లో డివిజన్, రీజనల్, జోనల్, రాష్ట్ర కార్యదర్శులుగా కార్మికులు, ఉద్యోగులకు అనేక సేవలు అందించారన్నారు. శివారెడ్డి మాట్లాడుతూ నిరంతరం కార్మికులకు అండగా ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో రీజనల్ చైర్మన్ రామిరెడ్డి, ప్రెసి డెంట్ నాగముణి, కడప డిపో అధ్యక్ష, కార్యదర్శులు జయరాం, శ్రీనివాసులు, రీజనల్ నాయకులు ఆర్.నారాయణ, దాస్, ప్రభాకర్, రంతుల్లా పాల్గొన్నారు.

## కడప కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా పోటీకి సిద్ధం

**– రాష్ట్ర కార్యదర్శి చీకటి చార్లెస్**

కడప వైద్యవిభాగం, మార్చి 2, ప్రభాతవార్త:



భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం నిర్ణయం ప్రకటిస్తే కడప పార్లమెంటు అభ్యర్థిగా పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నానని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చీకటి చార్లెస్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని పేద, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్య మన్నారు. నాకు కడప ఎంపీ అభ్యర్థిగా అవకాశం ఇవ్వాలని అధిష్టానాన్ని కోరుతున్నానన్నారు.

## అక్రమ కేసులు ఎత్తి వేయాలని నిరసన

పోరుమామిళ్ల మార్చి 2, ప్రభాతవార్త

పోరుమామిళ్ల మండల సమితి ఆధ్వర్యంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణని, వివిధ జిల్లాల్లో పార్టీ శ్రేణులను రాష్ట్ర ప్రభుత్వం అక్రమంగా అన్యాయం గా అరెస్టు చేయడాన్ని సిపిఐ ఏరియా సహాయ కార్యదర్శి పిడుగు మస్తాన్, కార్యవర్గ సభ్యులు సుబ్బారెడ్డి, కేశవులు నిరసించారు. అంబేద్కర్ విగ్రహం వద్ద మోకాళ్లపై నిరసన తెలిపి రాష్ట్ర ప్రభుత్వం తీరు మార్చుకొని పేదల పక్షాన నిలబడి, జగనన్న కాలనీ లబ్దిదారునికి ప్రతి ఒక్కరికి ఐదులక్షలు పెంచే వరకు పోరాటం ఆగదని డిమాండ్ చేయడం జరిగింది. రాష్ట్రంలో పేద ప్రజల పక్షాన పోరాటం చేస్తున్న కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలకు లీడర్లపై అక్రమ కేసులు, నిర్బంధాలు, నోటీసులు ఇవ్వడం చాలా దౌర్భాగ్యం ఉన్నారు. ఎర్రజెండా పట్టుకొని విజయవాడ ధర్నా అని పిలిపిస్తే రాష్ట్ర ప్రభుత్వానికి ఎందుకంత భయము అన్నారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు చెన్నయ్య, బి కోడూరు మండల కార్యదర్శి ప్రసాదు, సిపిఐ నాయ కులు వెంకటేశ్వర్లు, చెన్నయ్య, బెల్లం బాషా, సత్యనారాయణ, సుబ్రహ్మణ్యం, శ్రీను, నారాయణ, వీరయ్య, హసన్ వల్లి పాల్గొన్నారు.

## క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు

కడప కార్పొరేషన్, మార్చి 2, ప్రభాతవార్త:



క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఫుట్‌బాల్ సంఘం జిల్లా అధ్యక్షులు షేక్ మహబూబ్ హుసేన్, ఉపాధ్యక్షులు టీవీ తిరుపాల్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం కడప విద్యుత్తు భవన్ ఆవరణలోని మైదానంలో సీనియర్ ఉమెన్స్ ఫుట్‌బాల్ జిల్లా ఎంపికలు జరిగాయి. ఈ ఎంపికల్లో 29 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడల్లో రాణించాలని విద్యార్థినిలను ప్రోత్సహించారు. చదువులతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. రోస్టర్ పద్ధతి ద్వారా ఉద్యోగ అవకాశాలు పొందే అవకాశం ఉందని వెల్లడించారు. విశాఖపట్నంలో త్వరలో జరగనున్న రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ మ్యాచ్‌లకు ఎంపికలు నిర్వహించినట్లు తెలిపారు. ఇందుకోసం నిరంతరం సాదన చేయాలని సలహా ఇచ్చారు.

## డైరీని ఆవిష్కరించిన కమిషనర్

కడప కార్పొరేషన్, మార్చి 2, ప్రభాతవార్త:



కడప నగరపాలక సంస్థలో పని చేస్తున్న మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో జీవీఎంసీ ఏపీ మున్సిపల్ కార్పొరేషన్ మినిస్ట్రీరియల్ ఎంప్లా యిస్ వెల్ఫేర్ అసోసియేషన్ డైరీని కడప నగరపాలక సంస్థ కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్ చంద్ ఆవిష్కరించారు. నగరపాలక సంస్థలో పని చేస్తున్న సిబ్బందికి ఇంటి స్థలాలు ఇవ్వాల్సిందిగా కమిషనర్‌ను కోరగా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. ఇంటి స్థలాలు వచ్చే ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు. డైరీ ఆవిష్కరణలో యూనియన్ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ కె.శ్రీరాములు, అధ్యక్షులు షకీల్ అహ్మద్, జనరల్ సెక్రటరీ, రవిబాబు, ట్రెజరర్ లూకరాజు, యూనియన్ నేతలు విశ్వనాథ్‌రెడ్డి, జి.శివ కుమార్, విజయ భాస్కర్ గౌడ్, హిదయతుల్లా, ఇక్బాల్, ఖాజా మొహిద్దీన్, శివ, విష్ణువర్ధన్, హర్షవర్ధన్, కృష్ణయ్య, శోభన్‌బాబు పాల్గొన్నారు.

## స్టేట్ ఛాంపియన్‌లుగా నిలవాలి

**– జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు లయన్ కె.చిన్నపరెడ్డి**

కడప కార్పొరేషన్, మార్చి 2, ప్రభాతవార్త:



రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ ఛాంపియన్ షిప్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు చక్కగా రాణించి ఛాంపియన్లుగా నిలవాలని జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు లయన్ కంభం చిన్నపరెడ్డి కోరారు. కడప నగరంలోని డీఎస్ఏ క్రీడా మైదానంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న హ్యాండ్‌బాల్ శిక్షణ శిబిరం ముగిం పు కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా హ్యాండ్‌బాల్ జూనియర్ విభాగం జట్లను గురువారం ప్రకటించారు. క్రీడాదుస్తులు, రవాణా ఛార్జీలను అసోసియేషన్ ప్రతినిధులు క్రీడాకారులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా జట్టు విజేతగా నిలిస్తే రానున్న రోజుల్లో రాష్ట్ర స్థాయి పోటీల ను కడపలోనే నిర్వహించేందుకు కృషి చేస్తామన్నారు. సెక్రటరీ శివప్రసాద్ మాట్లాడారు. జిల్లా జట్టులో ఎన్.చాంద్‌బాషా, ఉదయ్‌కుమార్, అక్బర్, మల్లి కార్జున, మురళీకృష్ణ, రజాక్, ఆదిశేషారెడ్డి, ఈశ్వర్, సుమిత్‌కుమార్‌రెడ్డి, విక్రం, కల్యాణ్, నాగేంద్ర, మోహన్ నాయక్, వెంకటకృష్ణారెడ్డి, ప్రసాద్, గురువర్ధన్, సాయికిరణ్‌లు ఎంపికయ్యారు. కార్యక్రమంలో తిరుమల టింబర్ డిపో అధినేత కంచి గోపీకృష్ణ, జిల్లా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు లయన్ డా.ఆర్.రంగనాథరెడ్డి, లయన్స్ క్లబ్ కార్యదర్శి లయన్ గౌరీశంకర్, జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ శివప్రసాద్, హ్యాండ్‌బాల్ శిక్షకుడు అబ్దుల్ మునాఫ్, సీని యర్ క్రీడాకారులు సాయికిశోర్‌రెడ్డి, బసిరెడ్డి పాల్గొన్నారు.

## ఆడపిల్లల సంఖ్య పెరగాలి

ఖాజీపేట మార్చి 2, ప్రభాతవార్త



ఆడపిల్లల సంఖ్య రోజు రోజుకు తగ్గిపోతుందని, పురుషులతో సమానంగా సంఖ్యను పెంచడానికి అందరు కృషి చేయాలనీ డాక్టర్ ముబీన్ కోరారు. గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని కెజిబివి పాఠశాలలో నిర్వహించిన బేటి బజావో, బేటి పడావో కార్యక్రమంలో ఆయనతో పాటు మండల ఆరోగ్య విస్తరణ అధికారులు మాచనూరు రాఘవయ్య, బి.నాగభూషణం మాట్లాడుతూ బాల్య వివాహాలు, బ్రూణ హత్యలు, అరికట్టడం కోసం పాటుపడాలన్నారు. ఆడ బిడ్డలను కడుపులోనూ, పురిటిలోనూ చిదిమేయడం దారుణమని, బాల కార్మి కుల వివరాలు తెలిపేందుకు 1098 నెంబర్‌ను ఉపయోగించాలన్నారు. కార్యక్రమంలో మండల ఆరోగ్య విస్తరణ అధికారులు మాచనూరు రాఘవయ్య, బి.నాగభూషణం, సిహెచ్ఓ వెంకట సుబ్బమ్మ, పిహెచ్ యన్ అరుణ కుమారి, సూపర్‌వైజర్ కృష్ణప్రియ, సిహెచ్ఓ కీర్తి, కెజిబివి ప్రిన్సిపాల్ యం.కౌషర్, ఏయన్ యం శివనాగమణి, పకృతమ్మ, కజిబివి ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు, లక్ష్మీదేవి, వెంకట సులోచన, పాల్గొన్నారు.

## గర్భిణీలకు రక్తపరీక్ష తప్పనిసరి

కమలాపురం, మార్చి 2, ప్రభాతవార్త:



కమలాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య విధాన పరిషత్ ఐసీటీసీ జిల్లా అదనపు వైద్య ఆరోగ్య శాఖాధికారి ఖాదర్ వల్లీ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అందులో భాగంగా ఐసీటీసీలో పలు రికార్డులను, క్షయ నిర్ధారణ ల్యాబ్‌లు తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గర్భిణీలు తప్పనిసరిగా హెచ్ఐవీ తదితర రక్త పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ రాజారెడ్డి, ల్యాబ్ టెక్నీషియన్ హరి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## సమస్యలపై స్పందించిన ఎమ్మెల్యే

జమ్మలమడుగు, మార్చి 2, ప్రభాతవార్త:



జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయంలో సున్నపురాళ్లపల్లె, పెద్దదండ్లూరు, తదితర గ్రామాల ప్రజలతో కలిసి గురువారం వారి సమస్యలపై ఆర్డీవోతో ఎమ్మెల్యే డా.సుధీర్‌రెడ్డి చర్చించారు. వారి సమస్యలపై ఆర్డీవో సానుకూలంగా స్పందించి తప్పకుండా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధ తీసుకొని తమతో పాటు వచ్చి తమ సమస్యలను వివరించిన తీరుకు ప్రజలు ఆయనకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## చలివేంద్రం ప్రారంభించిన ఎస్సై చిన్న పెద్దయ్య

కమలాపురం, మార్చి 2, ప్రభాతవార్త:



నగర పంచాయతీ పరిధిలో అభి చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ విజయబాబు ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కమలాపురం ఎస్సై చిన్న పెద్దయ్య గురువారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించి మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రి పక్కన, ఆర్ఎస్ రోడ్డు అన్ని ఆఫీసులు కలిసే దగ్గర చలి వేంద్రం కార్యక్రమం ఏర్పాటు చేయడం అభి చారిటబుల్ ట్రస్ట్ చేసే సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఆయన కొనియాడారు. అభి చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ మాట్లాడుతూ ఈ చలి వేంద్ర కార్యక్రమానికి అడిగిన వెంటనే మాస్టర్ మేరీన్ నాలుగు బానలు స్పాన్సర్ చేసినందుకు ఈ చలివేంద్రం కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు ముది రాజ్, రామ లక్ష్మణ్, సునీత, ఏసురాజు, హనుమంతు, విజయ్ పాల్గొన్నారు.

## రెండు మార్కులతో నష్టపోయిన వారికి న్యాయం చేయాలి

కమలాపురం, మార్చి 2, ప్రభాతవార్త:



స్థానిక తెదేపా కార్యాలయంలో టీడీపీ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు పుత్తా ఎల్లారెడ్డి మాట్లాడుతూ ఎస్సై, పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాలలో చాలా మంది ఫెయిల్ అయ్యారని, 1, 2 మార్కులతో తప్పడం జరిగిందని సచివాలయం నోటిషికేషన్ 15 గ్రేస్ మార్కులు కలిపి జాబ్ ఇచ్చారు. కానీ ఇక్కడ జాబ్ ఇవ్వడం లేదు కదా జస్ట్ ప్రిలిమ్స్ క్వాలీఫై కోసం మాత్రమే అడుగుతున్నారని ప్రభుత్వం తక్షణం వారిని క్వాలీఫై చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ప్రభుత్వానికి నిరుద్యోగుల బాధలు ఎంత చెప్పినా అర్థం చేసుకునే పరిస్థితులో లేరని ఇప్పటికైనా వారి బాధలు గుర్తించాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంకిరెడ్డి, ఖాదర్‌బాషా, దివాకర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, శంకర్ యాదవ్, శ్రీనివాసులు, సుబ్బారెడ్డి తదితర తెలుగు యువత నాయకులు పాల్గొన్నారు.

## లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం

లక్కిరెడ్డిపల్లె, మార్చి 2, ప్రభాతవార్త:



లింగ నిర్ధారణ చట్ట రీత్యా నేరమని హెల్త్ ఎడ్యుకేటర్ బలరామరాజు పేర్కొన్నారు. బేటీ పడావో, బేటీ బచావో కార్యక్రమంలో భాగంగా గురువారం లక్కింరెడ్డిపల్లె ఏపీ మోడల్ స్కూలులో లింగ నిర్ధారణ చట్టంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బలరాంరాజు మాట్లాడుతూ రాష్ట్ర కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ప్రతి పాఠశాల లోనూ కిశోర బాలికలకు లింగ నిర్ధారణ పరీక్షల నిషేధ చట్టం గురించి అవగా హన కల్పించారు. విద్యార్థులు చిన్న వయసులో వివాహం చేసుకొని రక్తహీనత తగ్గి ప్రాణానికి అపాయమన్నారు. ప్రతి బాలిక ఆరోగ్య సూత్రాలు తప్పక పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ రేఖ, సీహెచ్ఓ రవీంద్ర, హెల్త్ సూపర్‌వైజర్ వెంకటేశ్వరరెడ్డి, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ కుమారి, ఏఎన్ఎంలు ఉమామహేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.

## గాయపడిన చంద్రమౌళికి ఆర్థిక చేయూత

లక్కిరెడ్డిపల్లె, మార్చి 2, ప్రభాతవార్త:



జనవరి 15వ తేదీన గువ్వల చెరువు ఘాట్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యను కోల్పోయి తన కుడికాలు పోగొట్టుకున్న చంద్రబాబును, కుటుంబాన్ని గురువారం మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సందర్శించి రూ.30వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ మేరకు మానవతా స్వచ్ఛంద సంస్థ కోశాధికారి శివయ్య, అధ్యక్షుడు రామాంజనేయులు, ఉపాధ్యక్షుడు గోపాల్, జిల్లా అధ్యక్షులు ప్రసాద్ యాదవ్, సాయి యాదవ్, ఛైర్మన్ బాలసుబ్రమణ్యం ఆధ్వర్యంలో ఆయనకు నగదు అందజేశారు. కార్యక్రమంలో మానవతా సభ్యులు గంగమ్మ ఆలయ కమిటీ ఛైర్మన్ సామ నరసింహారెడ్డి, రాజారెడ్డి, బాలాజీరెడ్డి, వెంకట రమణ పాల్గొన్నారు.

## వైసీపీ ప్రభుత్వంలో బీసీలకు అన్యాయం

లక్కిరెడ్డిపల్లె, మార్చి 2, ప్రభాతవార్త:



వైసీపీ ప్రభుత్వంలో బీసీల నిధులన్నీ ఇతర పథకాలకు పంపిణీ చేసి బీసీలకు అన్యాయం చేశారని రాయచోటి నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి ఆర్.రమేష్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం దప్పేపల్లి పంచాయతీలోని పలు గ్రామాల్లో మన రాష్ట్రానికి ఇదేం కర్మ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ రాష్ట్రాన్ని వైసీపీ ప్రభుత్వం అన్ని విధాలా భ్రష్టు పట్టించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీలకు, మైనార్టీలకు తీవ్ర అన్యాయం జరిగిందని ఇంటువంటి ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జి, మాజీ మార్కెట్ ఛైర్మన్ కాలాడి ప్రభాకర్ రెడ్డి, రవిశంకర్‌రెడ్డి, సర్పంచ్ కేశవయ్య, శ్రీరాములు, సుబ్బారెడ్డి, భూషణ్‌రెడ్డి, రమణ, వెంకట సుబ్బయ్య, దనుంజయ, హరినాథ, చంద్రశేఖర్, ముత్తన్న, కొప్పుల నాగమణి, సుబ్బరామయ్య, రమణ, వెంకట సుబ్బయ్య పాల్గొన్నారు.

## వైసీపీ అధికారంలోకి వచ్చాక పెరిగిన దాడులు

కడప వైద్యవిభాగం, మార్చి 2, ప్రభాతవార్త:



వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దాడులు, అన్యాయాలు పెరిగిపోయాయని టీడీపీ రాష్ట్ర క్రిస్టియన్ సెల్, వైస్ ప్రెసిడెంట్ ఎం.పి సురేష్ బాబు అన్నారు. గురువారం జిల్లా తెదేపా కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వైసీపీ, జగన్ సర్కార్ లో అభివృద్ధి అంటలే అరాచకాలు, దాడులు, అన్యాయాలే అని ధ్వజమెత్తారు. ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఉండవల్లిలోని చంద్రబాబు ఇంటిపై దండ యాత్ర, 2021లో అక్టోబరులో టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి, వాహనాలు ధ్వంసం, కుప్పంలో అన్న క్యాంటీన్‌పై దాడి, మదనపల్లి యాదవ్ ఇంటిపై దాడి, ఐటీ దాడులు, బెదిరింపులు, అరెస్టులు, ఇళ్లపై దాడులు అరాచకాలు తప్ప ఏమీ లేదన్నారు. అన్నీ ప్రజలు గమనిస్తున్నారని తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో భాస్కర్, ముని గోవర్ధన్ పాల్గొన్నారు.

## రేపు మండల సర్వసభ్య సమావేశం

సిద్దవటం, మార్చి 2, ప్రభాతవార్త:

సిద్దవటం మండల సర్వసభ్య సమావేశం ఈనెల 4వ తేదీ శనివారం మండల అధ్యక్షులు జ్యోతి వెంకటమ్మ అధ్యక్షతన జరుగుతుందని ఇన్‌ఛార్జి మండల పరిషత్ అభివృద్ధి అధికారి పులిరాంసింగ్ తెలిపారు. 90 రోజుల ప్రగతి నివేదికపై మండల అభివృద్ధిపై ఆయా శాఖలకు కలిగిన అధికారులు ప్రగతి నివేదికలను మండల సర్వసభ్య సమావేశానికి తీసుకురావాలన్నారు. సమావేశానికి నోటీసు అందిన ప్రతి అధికారులు ఎంపీటీసీ సర్పంచులు హాజరు కావాలన్నారు.

## పెంచిన గ్యాస్‌ధరలను తగ్గించాలి : సిపిఐ

మైదుకూరు మార్చి 2, ప్రభాతవార్త



పదే పదే గ్యాస్ ధరలను అమాంతం పెంచి ప్రజలపై పెను భారం మోపడం బాధకరమని పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి పి. శ్రీరాములు అన్నారు. గురువారం మైదుకూరులోని సిపిఐ కార్యాలయంలో శ్రీరాములు మాట్లాడుతూ ఒక వైపు నిత్యావసర సరుకుల ధరలు అమాంతం పెరిగిపోతున్న సందర్భంలో కనీసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్యాస్ ధరలను స్థిరంగా ఉంచకపోగా గత సంవత్సర కాలంలో ఐదు సార్లు గ్యాస్ పై ధరలను పెంచారని మరోవైపు కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీని పూర్తిగా తగ్గించారని దీనివల్ల కోట్ల రూపాయల భారం ప్రజలపై పడుతుందని కావున పెంచిన గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి ఏ.వి శివరామ్ బిల్డింగ్ వర్కర్స్ ఫెడరేషన్ నియోజకవర్గ కార్యదర్శి బి. వీరయ్య పాల్గొన్నారు.


## ఎమ్మెల్సీ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించండి : ఆర్‌డిఓ

తంబళ్లపల్లె, మార్చి 2, ప్రభాతవార్త:

తంబళ్లపల్లె నియోజకవర్గంలో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆర్డీవో మురళీ హెచ్చ రించారు. గురువారం ఆయన తంబళ్ల పల్లె లోని 301 పోలింగ్ స్టేషన్‌ను అధికా రులతో సమీక్షించారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ప్రొటోకాల్ నిర్వహణ లో అధికారుల ముందస్తు చర్యలు బాగున్నట్లు ప్రశంసించారు. ఆయన వెంట తహసీల్దారు కళావతి, ఎంపీడీవో ఆనంద్ కుమార్, ఎంఈవో త్యాగరాజు, ఎస్సై రామకృష్ణారెడ్డి, ఆర్ఐ రవి, వీఆర్వోలు శ్రీరాములు, రమణ పాల్గొన్నారు.

## హజ్ యాత్రికుల సౌకర్యార్థం మెరుగైన సేవలు

కడప ఏడురోడ్లు, మార్చి 2, ప్రభాతవార్త:



2023 సంవత్సరం హజ్ యాత్ర చేసే యాత్రికులకు ఏపీ ప్రభుత్వం మెరు గైన సేవలు అందించనుంది. ఈ ఏడాది హజ్ యాత్రకు విజయవాడ నుంచి విమానాలు వెళ్లేలా చర్యలు తీసు కుంది. ప్రతి జిల్లా నుంచి హజ్ యాత్రికుల సౌకర్యార్థం ప్రభుత్వం విజయవాడకు ప్రత్యేక బస్సులను నడపనుంది. హజ్ చేయాలనుకున్న యాత్రికుల సంవత్సరం ఆదాయం రూ.3లక్షలుంటే వారికి రూ.60వేలు, సంవత్సర ఆదాయం రూ.3లక్షల కంటే ఎక్కువ ఉన్న వారికి రూ.30వేలు సహాయం అందిస్తుంది. ఏపీ నుంచి వెళ్లే హజ్ యాత్రికులకు మక్కాలో ప్రత్యేక ప్రాంగణం ఏర్పాటు చేసి అక్కడే వసతి, వైద్య సౌకర్యాలు అందిస్తుంది. హజ్ యాత్రికులు హజ్ సొసైటీలో ఈనెల 10వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రకటించింది.

## విద్యార్థుల్లో సైన్స్ ఫేర్ నైపుణ్యం పెంపొందిస్తుంది

**– కార్పొరేటర్ గౌస్ బాషా (చాక్లెట్)**

కడప ఏడురోడ్లు, మార్చి 2, ప్రభాతవార్త:



సైన్స్ ఫెయిర్ ఏర్పాటు చేయడం వలన విద్యార్థినీ విద్యార్థులలో సైన్స్ పట్ల అవగాహనతో పాటు నైపుణ్యత పెరుగు తుందని సంఘ సేవకులు సలావుద్దీన్ అన్నారు. స్థానిక నకాష్ లోని దుబాయ్ ఇంటర్నేషనల్ హైస్కూల్‌లో గురువారం ఏర్పాటు చేసిన సైన్స్ ఫేర్‌లో విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులను పరిశీలిం చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. విద్యార్థులు చిన్నతనం నుంచి సాంకేతిక పరమైన విద్యపై దృష్టి సారించడం వలన రానున్న కాలంలో దేశాభి వృద్ధిలో భాగస్వా ములు కాగలరన్నారు. కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం అధ్యాపకులు పాల్గొన్నారు.

## అపూర్వ దేశభక్తుడు షేక్ మహమ్మద్

కడప ఏడురోడ్లు, మార్చి 2, ప్రభాతవార్త:



నగరంలో చాలా మంది రాజకీయ పార్టీల భక్తులు పార్టీ రంగు దుస్తులు వేసుకొని వారి వాహనాలకు వారి రంగు వేసు కొని మామూలు సమయాల్లో తిరిగే వారిని చూస్తుంటాం. కానీ ఎప్పుడూ జాతీయ జెండా పట్టుకొని తిరిగే అపూర్వ దేశభక్తుడిని నగరంలో తిరుగుతుండడం చూస్తున్నాం. గోకుల్ సర్కిల్ వద్ద ఉన్న రాఫీ వీధికి చెందిన సోషల్ వర్కర్ షేక్ మహమ్మద్ ఇస్మాయిల్ నగర పుర వీధుల్లో జాతీయ జెండాతో తిరుగుతూ మేరా భారత్ మహాన్, సారే జహాసే అచ్చా, హిందూస్థాన్ హమారా, జైహింద్ అనే నినాదాలతో తన దేశభక్తితో ప్రజల మన్ననలు పొందుతున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఊపిరి ఉన్నంత వరకు జాతీయ జెండాతోనే ఉంటానన్నారు.

## ప్రభుత్వాలు కార్పొరేట్ కంపెనీల కోసమా? ప్రజల కోసమా?

**– సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మనోహర్**

జమ్మలమడుగు, మార్చి 2, ప్రభాతవార్త:



కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ కంపెనీల ఆదాయం కోసం, ప్రజల సంక్షేమం కోసమా అని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.మనోహర్ ప్రశ్నించారు. గురువారం స్థానిక పాత బస్టాండులో గ్యాస్ పెంపుదలపై ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ రాష్ట్రంలో వైసీపీ రెండు కలిసి అనేక రూపాలలో ప్రజలపై భారాలు మోపుతున్నా రని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోదీ అధికారంలోకి వచ్చాక 17 సార్లు గ్యాస్ ధరలు పెంచి సామాన్య, మధ్య తరగతి వర్గాల నడ్డి విరుస్తున్నారన్నారు. మళ్లీ తాజాగా రూ.50 పెంచి మూలిగే నక్కపై తాడి పండు పడ్డ చందంగా మారిం దన్నారు. కార్యక్రమంలో సీపీఎం జమ్మలమడుగు కార్యదర్శి శివనారాయణ, నాయకులు వినయ్‌కుమార్, డేవిడ్, ప్రసాద్‌రెడ్డి, హాజీ సుబ్రమణ్యం, ప్రభాకర్ పాల్గొన్నారు.

## శనగల కొనుగోలు కేంద్రం తనిఖీ

జమ్మలమడుగు, మార్చి 2,

ప్రభాతవార్త:



ముద్దనూరు మండలంలోని నల్లబల్లె రైతు భరోసా కేంద్రం పరిధిలో ప్రభు త్వం ఏర్పాటు చేసిన శనగల కొనుగోలు కేంద్రాన్ని స్థానిక తహసీల్దారు జి.వెంక టేశ్వర్లు మండల వ్యవసాయాధికారి మారెడ్డి వెంకట కృష్ణారెడ్డితో కలిసి పరిశీలించారు. శనగలు కొనుగోలు మరియు ప్రాసెస్ (జల్లి పట్టే ప్రక్రియ) విధానం తూకాలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో శనగ పంట సాగు చేసి పంట నమోదు చేసుకొని ఈకేవైసీ పూర్తి చేసుకున్న ప్రతి రైతు పండించిన శనగలను ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర రూ.5335లకు అమ్ముకోవాలని తెలిపారు. రైతు భరోసా కేంద్రంలో శనగలను అమ్ముకునేందుకు ముందుగా సీఎం యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. రైతులకు ఎటువంటి సమస్యలు లేకుండా చూడాలని ప్రొక్యూర్‌మెంట్ ఏజెన్సీ వారిని కోరారు. అనంతరం రైతు భరోసా ఏంద్రాన్ని సందర్శించి డిజిటల్ కియోస్క్ మిషన్ పని తీరు పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీఈవో శ్రావణి, మరియు గ్రామ రైతు బయపురెడ్డి, గురుబాబు, ఏజెన్సీ సిబ్బంది సుబ్బయ్య, రమణయ్య, భార్గవ్ పాల్గొన్నారు.

# సచివాలయం సిబ్బందికి కార్యదర్శులు బాధ్యులు

రామాపురం.మార్చి 02 ప్రభాతవార్త



సచివాలయ సిబ్బంది ఎక్కడికి వెళ్లినా సచివాలయ కార్యదర్శులు బాధ్యత వహించాలని ఎంపిడివో హైదర్‌వలి అన్నారు. స్థానిక ఎంపిడివో కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శులుకు డిజిటల్ అసిస్టెంట్‌లకు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయ కార్యదర్శులు అనుమతి లేనిదే సెలవు గాని మెడికల్ లీవ్‌లు గాని పెట్టకూడదన్నారు. సిబ్బంది ప్రతి ఒక్కరూ బయోమెట్రికల్ చేయాలన్నారు. బయోమెట్రిక్ వేయని సిబ్బందిపై గైర్హాజరైన సిబ్బందిపై కలెక్టర్‌కు నివేదిక పంచాయతీ కార్యదర్శులు ఇవ్వడం జరుగుతుందన్నారు. పంచాయతీ కార్యదర్శులు సెలవులు పెట్టాలంటే ముందుగా డిజిటల్ అసిస్టెంట్ కు తెలియజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవోపిఆర్‌డి ఉషారాణి, ఏవో శివశంకర్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల దృష్ట్యా చెక్‌పోస్ట్ ఏర్పాటు

ఏఎస్ఐ రఘురామయ్య

గాలివీడు. మార్చి 02 ప్రభాతవార్త



ఎమ్మెల్సీ ఎన్నికల దృష్ట్యా మండలంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఏఎస్ఐ రఘురామయ్య పేర్కొన్నారు. పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు ఈ నెల 13న జరగనున్న ఎన్నికల నేపధ్యంలో మండలంలోని సరిహద్దు ప్రాంతమయిన వెలిగల్లు ఇందుకూరివాండ్లపల్లి వద్ద చెక్ పోస్టను ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల నియమావళికి లోబడి ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు మద్యం, నగదు తరలింపును అరికట్టేందుకు పోలీస్ సిబ్బంది దేగకన్నుతో గస్తీ కాయనున్నట్లు ఆయన తెలిపారు.

# విద్యార్థులకు బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంపై అవగాహన సదస్సు

లింగ నిర్ధారణకు పాల్పడటం చట్ట రీత్యా నేరం

కాశినాయన, మార్చి 02 ప్రభాతవార్త :



మండలంలోని వరికుంట్ల కేజీబివి పాఠశాలలో గురువారం బేటీ బచావో, బేటీ పడావో కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆడ పిల్లల శాతం గణనీయంగా తగ్గిపోతున్న తరుణంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ నిర్మల మాట్లాడుతూ ఆడ పిల్లలను చదివిద్దాం, ఆడ పిల్లలను రక్షిద్దాం, ఈనాటి ఆడ పిల్లలే రేపటి తల్లులు కావున ప్రతివిద్యార్థి కూడా అవగాహన కలిగి ఉండాలని ఆడ పిల్లలను భ్రూణహత్యలకు పాల్పడడం నేరం, చట్ట రీత్యా శిక్షార్హులని తెలియజేశారు. ప్రతి గర్భిణీ మహిళ ఆసుపత్రికి వెళ్ళి స్కానింగ్ చేయించుకొని పుట్టబోయేది ఆడ పిల్ల అని తెలిసిన వెంటనే అబార్షన్ చేయించుకుంటున్నారని, అది చట్ట రీత్యా పెద్ద నేరం అని మీరు తెలుసుకోవాల్సింది ఎంతైనా ఉందని విద్యార్థులకు తెలిపారు. జిల్లాలో వెయ్యి మంది మగ పిల్లలు ఉంటే 950 మంది మాత్రమే ఆడ పిల్లలు ఉన్నారని, ఇంత వ్యత్యాసం ఉన్న యెడల దేశ జనాభా కుంటుపడుతుందని మండల ఆరోగ్య విస్తరణ అధికారి శ్రీనివాస్ రెడ్డి విద్యార్థులను ఉద్దేశించి తెలియజేశారు. అదే విధంగా వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, పరిసరాల పరిశుభ్రత పాటించి చేతులను తరుచుగా శుభ్రం చేసుకోవాలని, తద్వారా 50 శాతం అంటువ్యాధులను అరికట్టవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి సుబ్బరాయుడు, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, కేజీబివి పాఠశాల ఉపాధ్యాయులు మరియు 230 మంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శ పాఠశాల ఆకస్మిక తనిఖీ

రామాపురం.మార్చి02 ప్రభాతవార్త



మండలంలోని ఆదర్శ పాఠశాలను గురువారం ఆంధ్రప్రదేశ్ బాలల హక్కుల పరిరక్షణ కమీషనర్ ఎం.లక్ష్మీదేవి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులకు విడివిడిగా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలల హక్కుల గురించి విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా 10వ తరగతి విద్యార్థులకు సమాజంలో ఎదురయ్యే సమస్యలను ఎలా ఎదుర్కోవాలో అవగాహన కల్పించారు. వసతి గృహ విద్యార్థినిలకు వసతులు గురించి ఆమె అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల హక్కుల పరిరక్షణ సమితి జిల్లా సభ్యులు, ఆ పాఠశాల ప్రిన్సిపల్ శ్యామలాదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# లిప్ కార్యక్రమం అమలులో అలసత్వం వద్దు

వేంపల్లె, మార్చి 2, ప్రభాతవార్త :



పాఠశాలల్లో చదవడం, రాయడంలో వెనుకబడ్డ విద్యార్థుల అభ్యసనను మెరుగు పరిచేందుకు ప్రభుత్వం లిప్ కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోందని మానిటరింగ్ అధికారి చెరుకూరు శ్రీనివాసులు అన్నారు. గురువారం వేంపల్లెలోని మదీనాపురం ఉర్దూ యూపీ స్కూల్‌ను మానిటరింగ్ అధికారి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లిప్ అమలులో ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. ముఖ్యంగా బి గ్రేడ్ విద్యార్థులపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సలావుద్దీన్, హబీబున్నీసా, అహమ్మదున్నీసా, తదితరులు పాల్గొన్నారు.

# జడ్పీహెచ్‌ఎస్‌ను తనిఖీ చేసిన డిప్యూటీ డీఈవో

పెండ్లిమర్రి, మార్చి 2, ప్రభాతవార్త:



కడప డిప్యూటీ డీఈవో సి.రాజగోపాల్‌రెడ్డి గురువారం మండలంలోని వెల్లటూరు గ్రామంలో ఉన్న జడ్పీ హెచ్ స్కూలును ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఇందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో పి.సుజాత, హెచ్‌ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, విద్యార్తులు పాల్గొన్నారు.

# పేదలపాలిట శాపంగా మారిన సీనరేజ్ టెండర్లు

వేంపల్లె, మార్చి 2, ప్రభాతవార్త :



రాష్ట్రంలో చిన్నతరహా ఖనిజాలను సీనరేజ్ ఛార్జిలు వసూలు కోసం వైకాపా ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తులకు ఇవ్వడం పేద ప్రజల పాలిట శాపంగా మారిందని టీడీపీ సీనియర్ నాయకుడు మహమ్మద్ షబ్బీర్ ధ్వజమెత్తారు. గురువారం వేంపల్లెలోని ఆయన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ జిల్లాకు సంబంధించి వైకాపా మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి బినామీ అయిన హిల్‌సైడ్ ఎస్టేట్స్ లిమిటెడ్ లియాబిలిటీ పార్టనర్‌షిప్ అనే కంపెనీ పేరుతో వైకాపా నేతలకు దోచి పెట్టడం సరికాదన్నారు. పేదల ప్రజలు గృహ నిర్మాణాలకు అవసరమైన గ్రావెల్, కంకర, కొండరాళ్లు, నిడ్జి బండలు అధిక ధరలు వసూలు చేయడానికి ఉపయోగపడుతున్నాయన్నారు. ఇప్పటికే గృహనిర్మాణ సామాగ్రి, ఇసుక సైతం అధిక ధర చెల్లించాల్సిన పరిస్థితి ఉందన్నారు. మూలిగేనక్క మీద తాటికాయ పడ్డ చందంగా గ్రావెల్, కంకర, కొండాళ్లు, ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడం దారుణం అన్నారు. పేదలు ఇళ్లు నిర్మించాలంటే విలవిలలాడే పరిస్థితులు దాపురించాయని ఘాటుగా విమర్శించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రైతు విభాగం ఉపాధ్యక్షుడు జగన్నాథరెడ్డి, నాయకులు కృష్ణారెడ్డి, తిప్పారెడ్డి, పి.వి.రమణ, గోటూరు నాగభూషణం, దొంతు సుమన్, ఇలియాస్, మహబూబ్ షరీఫ్, శ్రీనివాసులురెడ్డి, హబీబ్, శివయ్య, బాబు, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.500కే వంటగ్యాస్

వేంపల్లె, మార్చి 2, ప్రభాతవార్త ః



కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రూర.500కే వంటగ్యాస్ సిలిండర్ సరఫరా చేస్తారని ఏపీసీసీ మీడియా ఛైర్మన్ డాక్టర్ ఎన్.తులసిరెడ్డి అన్నారు. గురువారం వేంపల్లెలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బుధవారం వంటగ్యాస్ సిలిండర్ ధర రూ.50, వాణిజ్య సిలిండరు ధర రూ.350 పెంచడం గర్హనీయమని, అమానవీయం అన్నారు. 2014లో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధర బ్యారెల్‌కు 114 డాలర్లు ఉనప్పుడు దేశంలో పెట్రోలు ధర రూ.70లు, డీజిల్ ధర రూ.50, వంటగ్యాస్ రూ.410 ఉండేదన్నారు. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో బ్యారెల్ ముడిచమురు 90డాలర్లే ఉన్నప్పటికీ దేశంలో పెట్రోలు, డీజిల్, వంటగ్యాస్ ధరలను పెంచుతూ మోదీ ప్రభుత్వం ప్రజల నడ్డి విరుస్తోందన్నారు. పెంచిన వంటగ్యాస్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# మామూళ్ల మత్తులో ఎస్ఇబి అధికారి

రైల్వేకోడూరు రూరల్, మార్చి 2 ప్రభాతవార్త



రైల్వేకోడూరు పట్టణంలో ఎక్సైజ్ సిఐ పలురకాల మామూళ్ల మత్తులో తులతూగి మద్యం మత్తులోనే విధులు నిర్వహిస్తున్నారని వైసిపి సీనియర్ నాయకులు, స్టేట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పర్వతం విజయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల కాలంలో తెలుగుదేశంపార్టీ వారికే మద్దతు ఇచ్చి పట్టుబడినవారిని వదిలేసి వైసిపికి సంబంధించిన వారిని కేసు నమోదు చేసి హింసిస్తున్నాడని విజయ్‌కుమార్‌రెడ్డి తెలియజేశారు. ఇతను విధుల్లోనే మద్యం సేవించి పట్టుబడినవారి వద్దనుండి మామూళ్లు తీసుకొని విధులు నిర్వహిస్తున్నారని ఆయన ఆరోపించారు. పూర్తిస్థాయిలో ఇతనిపై మండలంలోని పలు గ్రామాల ప్రజలు స్టేషన్ వద్దనే భారీ ధర్నా చేసేందుకు సిద్ధంగా ఉన్నారని విజయ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. పద్ధతి మార్చుకోకుంటే రాష్ట్ర ముఖ్యమంత్రి, రాజంపేట పార్లమెంట్ సభ్యులు మిథున్‌రెడ్డి దృష్టికి తీసుకెళతామని అన్నారు.

# గృహ నిర్మాణాలను వేగవంతం చేయండి

దువ్వూరు, మార్చి 2, ప్రభాతవార్త:



మండల పరిధిలో పక్కా గృహాల నిర్మాణాలను వేగవంతం చేయాలని అందుకు లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని మండల ప్రత్యేక అధికారి ఓబులేసు నందన్ అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలోని సభాభవన్‌లో గృహ నిర్మాణం, వివిధ అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పక్కా గృహాల నిర్మాణం నిర్ణయించిన లక్ష్యాలను సాధించాలన్నారు. జగనన్న కాలనీ, వ్యక్తిగతంగా మంజూరు చేసిన గృహాలు పూర్తి చేయాలని అందుకు పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు కృషి చేయాలన్నారు. ఇళ్లు నిర్మించుకుంటున్న వెంటనే బిల్లులు చెల్లించేలా ఏర్పాటు చేశామని, మౌలిక వసతులు కల్పించామన్నారు. జగనన్న కాలనీలలో గృహ నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. ఎంపీడీవో జగదీశ్వర్‌రెడ్డి, తహసీల్దారు రమాకుమారి, హౌసింగ్ ఏఈ శాంతి, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# కండెక్టరు నిజాయతీ

దొరికిన సెల్‌ఫోన్‌ను ప్రయాణికుడికి అప్పగించిన వైనం

పీలేరు, మార్చి 2ప్రభాతవార్తః



కండెక్టరుకు దొరికిన సెల్‌ఫోన్‌ను ప్రయాణికుడికి అప్పగించిన సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. సంబేపల్లె మండలం మోటకట్ల గ్రామానికి చెందిన పూజల కాటంరాజు బుధవారం పీలేరు ఆర్టీసీ బస్సులో సంబేపల్లె నుంచి తిరుపతికి ప్రయాణిస్తూ బస్సులో సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. విధి నిర్వహణలో ఉన్న కండెక్టర్ వెంకటరమణకు దొరికింది. బస్టాండులో విధి నిర్వహణలో ఉన్న హెచ్‌కానిస్టేబుల్ ఆదినారాయణకు తెలుపగా సెల్‌ఫోను పోగొట్టుకున్న కాటంరాజును పీలేరుకు పిలిపించి కంట్రోలర్ సత్యనారాయణ, పుస్తకాల వెంకటరమణ సమక్షంలో సెల్‌ఫోనును అప్పగించారు. పలువురు కండెక్టరును ప్రశంసించారు.

# ఈశాన్య రాష్ట్రాల్లో గెలుపుతో బిజెపి సంబరాలు

రాజంపేట అర్బన్, మార్చి 2 ప్రభాతవార్త



ఈశాన్య రాష్ట్రాలైన త్రిపుర, నాగాలాండ్ రాష్ట్రాల్లో బిజెపి గెలుపుతో ఆ పార్టీ నాయకులు గురువారం సంబరాలు చేసుకున్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానికి చేరుకున్న బిజెపి రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు, అసెంబ్లి ఇన్‌ఛార్జి పోతుగుంట రమేష్‌నాయుడులు క్రీడాకారులకు, వాకర్లకు స్వీట్లను పంచారు. కేంద్రంలో అధికారంలో బిజెపి ప్రభుత్వం పట్ల, ప్రధాని నరేంద్రమోడి నాయకత్వం పట్ల ఈశాన్య రాష్ట్రాలు అధికారాన్ని కట్టబెట్టారన్నారు. ప్రజల్లో మోడి పట్ల ఉన్న విశ్వాసానికి ఈశాన్య రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో బిజెపి విజయదుందుబి మోగించడమే కారణమన్నారు. కార్యక్రమంలో పట్టణ ప్రధానకార్యదర్శి జికె నాగరాజు, ఉపాధ్యక్షుడు తోట నగేష్, బిజెవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.సూర్యచంద్ర, నేతలు పాల్గొన్నారు.

# ఎపికి భారీ పెట్టుబడులు

ఛాలెంజ్‌గా తీసుకొన్న సిఎం వైఎస్ జగన్ : ఎమ్మెల్యే కొరముట్ల

రైల్వేకోడూరు రూరల్, మార్చి 2 ప్రభాతవార్త



ఆంధ్రప్రదేశ్‌కు భారీ ఎత్తున పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామీకరణ వైజాగ్‌కు రానున్నదని రైల్వేకోడూరు ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం చిత్తు కాగితాలతో అవి సంపాదించాం, ఈ పరిశ్రమ తెచ్చాం అని కల్లిబొల్లి మాటలతో మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పనిచేశారని, అవి అంతా కేవలం ప్రజలను తప్పుదోవ పట్టించేందుకేనని ఎమ్మెల్యే కొరముట్ల విమర్శించారు. త్వరలో విశాఖపట్టణానికి భారీ పోర్టులు మూడు రానున్నాయని, అందులో వేలాది మందికి ఉపాది రానున్నదని, అదే విధంగా ఆంరధప్రదేశ్‌లో అంబాని, ఆదాని, గ్లోబల్ ఇన్విస్ట్‌మెంట్ సమ్మిట్ రానున్నదని, ఇప్పటికే రాష్ట్ర ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో ఎన్నో పారిశ్రామీకరణ సంస్థలు ఎపికి రానున్నాయని, రాష్ట్ర ముఖ్యమంత్రి ముందు చూపుతోనే ప్రగతికి బాటలు వేస్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రి చెప్పిందే చేస్తారని, అందుకు నిదర్శనమే కడపలో స్టీలు ఫ్యాక్టరి, పలురకాల పారిశ్రామిక దిగ్గజాలతో ఆయన మాట్లాడి త్వరలోనే ఆంధ్రప్రదేశ్‌కు పారిశ్రామీకరణ తరలిరాబోతున్నదని అన్నారు. రాష్ట్ర ప్రగతిలో పారిశ్రామిక సంస్థలు ఎంతో అభివృద్ధికి బాటలు వేసే రోజులు దగ్గరలో ఉన్నాయని అన్నారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ పారిశ్రామికరంగంలో అభివృద్ధిలో 3 సార్లు నంబర్‌వన్ స్థానానికి చేరిందని ఆయన అన్నారు.

నారా లోకేష్‌కు జనాలు కరవు

రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తనయుడు చేపట్టిన యువగళం పాదయాత్రకు జనాలు లేక వెలవెలబోతున్నారని కోడూరు ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. నారా లోకేష్ నోరు తిరగని నాయకుడని, తన తండ్రి ఎంతో ఉన్నత భావాలతో జనాలను పైసలు ఇచ్చి తోలుతున్నాడని, ఈ విషయాన్ని పాల్గొన్న మహిళలే యదేచ్ఛగా జబర్‌దస్త్‌లో మాట్లాడుకొన్నట్లు మాట్లాడుతున్నారని, రాజకీయాలు అంటే నారా లోకేష్‌కు తెలియని గుండుసున్నా లాంటివారని నారా లోకేష్‌ను విమర్శించారు. భవిష్యత్తులో వైసిపి ప్రభుత్వానికి తిరుగులేదని, రాష్ట్ర ప్రజలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు ముఖ్యమంత్రిగా చూడనున్నారని కొరముట్ల అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి, సుధాకర్‌రాజు, రమేష్, సర్పంచ్‌లు నాయిని హరిక్రిష్ణారెడ్డి, గోపి, దొమ్మరాజు సుబ్రమణ్యంరాజు, ఆనాల చెంగల్‌రెడ్డి, బిసి మానటరింగ్ సభ్యులు బత్తల సుబ్రమణ్యం, మల్లు క్రిష్ణారెడ్డి, రమణారెడ్డి, రాజారెడ్డి, దామర్ల సిద్ధయ్య, రవూఫ్, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కేజీబీవీని తనిఖీ చేసిన కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్

పెండ్లిమర్రి, మార్చి 2, ప్రభాతవార్త:



మండలంలోని కేజీబీవీ హాస్టల్‌ను గురువారం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పి.సుబ్రమణ్యం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ ఆడ బిడ్డను చదివించండి, ఆడ బిడ్డను రక్షించండి అనే నినాదం ప్రకారం ఆడబిడ్డలకు చదువు మీద, వ్యక్తిగత పరిశుభ్రతపై, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఆడబిడడలు ఉన్నత చదువులు చదవాలని తెలిపారు. ఆడ, మగ అనే తేడా లేకుండా తల్లిదండ్రులు వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శ్రీమతి పద్మావతమ్మ, హెల్త్ అసిస్టెంట్ చంద్రమోహన్, జీఎస్ ఏఎన్ఎం ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులను చదువుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలి

ఎంఇఒ గంగిరెడ్డి

నందలూరు, మార్చి 2 ప్రభాతవార్త



పదో తరగతి చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలు బాగా చదువు కునేలా ప్రోత్సహించాలని మండల విద్యాశాఖ అధికారి గంగిరెడ్డి కోరారు. నైట్‌విజన్ కార్యక్రమంలో భాగంగా నాగి రెడ్డిపల్లె జిల్లా పరిషత్ ఉన్న త పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థుల ఇళ్ల వద్దకు ఉపాధ్యాయులతో కలిసి వెళ్లి తల్లిదండ్రులకు సలహాలు, సూచనలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలు పూర్తయ్యేంతవరకు టీవీలను కట్టిపెట్టాలని కోరారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలు అందుకోవాలంటే పదో తరగతి బేస్‌మట్టం లాంటిదని అన్నారు. తల్లిదండ్రులు విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా బాగా చదువుకునేలా ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించి పదో తరగతిలో మంచి మార్కులు సాధించి ఉన్నత శిఖరాలు అందుకునేలా ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గంగాధర్, ఖాజాహుస్సేన్, చాన్‌బాష, చంద్రకాంత్, స్వర్ణలత, గౌరి, రమణమ్మ పాల్గొన్నారు.

# టిబి రోగులు దత్తత

పుల్లంపేట, మార్చి 2 ప్రభాతవార్త



టిబి రోగులను 6 నెలల పాటు దత్తత తీసుకొని వారికి పౌష్టికా హారాన్ని అందించే కార్యక్రమంలో భాగంగా పుల్లంపేట మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సమావేశం జరిగింది. మండలంలో మొత్తం 17 మంది టిబి రోగులను ప్రధానమంత్రి ముక్తా భారత్ అభియాన్ ప్రోగ్రాంలో భాగంగా ప్రతిరోగికి 6 నెలల పాటు పౌష్టికాహారం అందించాలనేది ముఖ్య ఉద్దేశ్యం. ఈ సందర్భంగా మండల పరిషత్ అధ్యక్షులు ముద్దా బాబుల్‌రెడ్డి 6 మందిని దత్తత తీసుకోగా మండల రెవెన్యూ అధికారి కుమార్ ముగ్గురిని దత్తత తీసుకోవడం జరిగింది. అలాగే టివిఎన్‌ఆర్‌పురం గ్రామానికి చెందిన యశ్వంత్‌గౌడ్ టిబి వ్యాధిగ్రస్థులను, డిసిసిబి మాజీ ఎ.సుబ్రమణ్యంరెడ్డి మరో ముగ్గురిని దత్తత తీసుకొన్నట్లు వైద్యాధికారి శేఖర్ తెలిపారు. ఈ సమావేశంలో మొదటినెలకు సంబంధించిన పౌష్టికాహారాన్ని ఎంపిపి బాబుల్‌రెడ్డి చేతులమీదుగా పంపిణీ చేయడం జరిగింది. సమావేశంలో డిప్యూటి డిఎంహెచ్ఓ చిన్నిక్రిష్ణ, అదనపు జిల్లా వైద్యాధికారిని శైలజా, రైల్వేకోడూరు టిబి మెడికల్ ఆఫిసర్ మహేష్, తహశిల్దారు నరసింహకుమార్, డాక్టర్ మనోజ్, విశ్రాంత సిహెచ్ఓ పిల్లి పిచ్చయ్య, సిహెచ్ఓ రాజా, టిబి సూపర్‌వైజర్ జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా వ్యవహరించాలి

-అధికారులను ఆదేశించిన జిల్లా ఎన్నికల అధికారి గిరీషా పిఎస్

రాయచోటి.మార్చి02 ప్రభాతవార్త



ఎమ్మెల్సీ ఎన్నికల విధులు పట్ల అధికారులు ప్రతిక్షణం అప్రమత ంగా వ్యవహరిస్తూ పారదర్శకంగా పోలింగ్ ఘట్టం పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి మరియు కలెక్టర్ గిరీషా పిఎస్ ఆదేశించారు. గురువారం అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి కలెక్టరేట్ మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ బహిరంగ సభలు, ర్యాలీలు, వాహనాల అనుమతులకు జిల్లా కేంద్రంలోని సింగిల్ విండో సిస్టం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబందించి పోలింగ్ కేంద్రాలలో టాయిలెట్స్, డ్రింకింగ్ వాటర్, ర్యాంప్‌లు, విద్యుత్ కనీస సదుపాయాలు ఖచ్చితంగా ఉండాలన్నారు. ప్రతి సెక్టార్‌కు మొబైల్ పార్టీ, ఫ్లయింగ్ స్క్వాడ్ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్‌ను ఏర్పాటు చేసి వీడియో రికార్డింగ్ చేయించాలన్నారు. పోలీస్ విధులలో పాల్గొనే వారికి పోస్టల్ బ్యాలెట్ ఫామ్ 12 ఇవ్వాలని సూచించారు. మైక్రో అబ్జర్వర్‌లకు ఈనెల 8వ తేదీన శిక్షణ ఉంటుందన్నారు. 9వ తేదీ ప్రిసైడింగ్ అధికారులకు రెండో విడత శిక్షణ ఉంటుందన్నారు. ఎక్కడ మ్యాన్ పవర్ సమస్య లేకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని మాన్య పవర్ మేనేజ్‌మెంట్ నోడల్ అధికారికి ఆదేశించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో వెబ్ కాస్టింగ్ తప్పకుండా చేయించాలని డిపివో ను ఆదేశించారు. బ్యాలెట్ బాక్స్‌లు పనిచేస్తున్నాయో లేదో రెండు మూడు సార్లు చెక్ చేసుకుని తీసుకెళ్లాలన్నారు. ఎన్నికల విధులలో పాల్గొనే సిబ్బందికి శిక్షణ క్షుణ్ణంగా ఇవ్వాలన్నారు. ట్రాన్స్‌పోర్ట్ మేనేజ్‌మెంట్‌కు సంబందించి ఏపిఎస్ ఆర్టిసి బస్సులును తీసుకోవాలని డిటిడిసిని ఆదేశించారు. ఈ సమీక్షలో జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియా, రాజంపేట సబ్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్‌ఖాన్, ఏఎస్పీ రాజ్‌కుమల్, డిఆర్‌వో సత్యనారాయణ, రాయచోటి, మదనపల్లి ఆర్‌డివోలు రంగస్వామి, మురళీ, నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వంట గ్యాస్ ధరల పెంపు వెంటనే రద్దు చేయాలి

నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి


రాయచోటి మార్చి 2 ప్రభాతవార్త:



ప్రభుత్వం వంట గ్యాస్ ధరలను విపరీతంగా పెంచుతూ సామాన్య ప్రజానీకం మీద పెద్ద ఎత్తున భారాలు మోపుతోందని, తక్షణమే ఆ భారాలను రద్దు చేయాలని రాయచోటి నియోజకవర్గ ఇన్చార్జ్ రమేష్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం నాడు రాయచోటి నియోజకవర్గం లో విలేకరులతో మాట్లాడుతూ గ్యాస్ ధరల పెంపు వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోనే వైసీపీ ప్రభుత్వం, వరుసగా గ్యాస్ ధరలను పెంచుకుంటూ పోతుందని వారు తీవ్రంగా విమర్శించారు. 2014 మార్చిలో 410 రూపాయలుగా ఉన్న సిలిండర్ ధర ప్రస్తుతం 1240 రూపాయలకు చేరిందన్నారు. గృహ వినియోగానికి వాడే వంటగ్యాస్ మీద 50 రూపాయలు వాణిజ్య అవసరాలకు వినియోగించే వంటగ్యాస్ సిలిండర్ మీద 350 రూపాయలు భారం మోపడం సమంజసం కాదన్నారు. దీని కారణంగా సామాన్య, మధ్యతరగతి ప్రజానీకం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందన్నారు. చిరు వ్యాపారస్తులు, తమ వ్యాపారాలు జరగక కష్టాలు పడే అవకాశం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఒకవైపు గ్యాస్ ధరలను పెంచి మరోవైపు విమాన ఇంధన ధరలను నాలుగు శాతం తగ్గించటం జరిగిందన్నారు. ఇప్పటికే సామాన్య ప్రజానీకం మీద పెట్రోల్, డీజిల్ ఇతర నిత్యావసర వస్తువులు బాగా పెరిగిపోయాయని వారన్నారు. మళ్లీ గ్యాస్ మీద ధర పెంచటం ప్రజానీకంను ఇబ్బందుల్లోకి నెట్టడమేనని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గుముఖం పట్టినా, మన రాష్ట్రంలో,ఎందుకు ధరలు పెంచుతున్నారో ప్రజానీకానికి సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని వారన్నారు. గ్యాస్ ధరల పెంపును తక్షణమే రద్దు చేయాలని, లేని పక్షంలో ప్రజానీకాన్ని కలుపుకొని పెద్ద ఎత్తున పోరాటాలను కొనసాగిస్తామని రాయచోటి నియోజకవర్గం ఇంచార్జ్ రమేష్ కుమార్ రెడ్డి హెచ్చరించారు.

# బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం

దువ్వూరు, మార్చి 2, ప్రభాతవార్త:



నేటి సమాజంలో ఇంకా కొంత మంది బాల్య వివాహాలు చేస్తున్నారని అవి చట్టరిత్యా నేరమని దువ్వూరు ప్రాథమిక వైద్యాధికారి డా.సురేష్‌బాబు అన్నారు. గురువారం స్థానిక కస్తూర్బా బాలికా విద్యాలయంలో బేటీ బచావో, బేటీ పడావో అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో స్త్రీ, పురుషులు సమానమే అని వీరి మధ్య వివక్ష ఉండరాదన్నారు. అన్ని రంగాల్లో స్త్రీలు పోటీ పడుతున్నారు. అయితే కొంత మంది పుట్టబోయే బిడ్డ ఆడ శిశువు అని గర్భస్రావానికి పాల్పడుతున్నారని ఇది చట్టరీత్యా నేరమన్నారు. గర్భస్థ, పిండ పరీక్ష ప్రక్రియ నియంత్రణా మరియు నివారణ చట్ట ప్రకారం ఎటువంటి జన్యుపరమైన పరీక్షలు నిర్వహించరాదన్నారు. అలా చేస్తే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యవిస్తరణాధికారి మురళీధర్‌మూర్తి, మేరీసువర్ణ, కస్తూర్బా ప్రత్యేక అధికారి మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# ఆలయం వద్ద అన్నదానం మాకు సంబందం లేదు

ఆర్చకులు గురుస్వామి

ఒంటిమిట్ట మార్చి 2 ప్రబాతవార్త:



ఒంటిమిట్ట చెరువు కట్ట పై వున్న వీరాంజనేయస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంతో మాకు సంబందంలేదని ఆలయ ఆర్చకులు, కోదండరామాలయ ఆస్థాన పురోహితులు ఏల్వేశ్వరం గురుస్వామి ఒక ప్రకటనలో తెలిపారు.కొంతమంది వ్యక్తులు ఎటువంటి రిజిస్ట్రేషన్‌న్లు లేకుండా అనదికారంగా అన్నదానం చేస్తున్నరని దీనితో మాకు సంబందం లేదన్నారు.వంశంపారపర్యంగా ఆంజనేయస్వామి దేవాలయం తన ఆదీనంలో ఉన్నదని దేవాలయంశిదిలావస్థలో ఉన్న సమయంలో భక్తులనుంచి సేకరించిన విరాళాలతో అభివృద్ధి చేయడం జరిగిందన్నారు.ఇప్పటికి నిత్యదూపదీనైవేద్యం ఆరాదనలకు భక్తులు సహాయం చేస్తున్నరని తెలిపారు.ఆలయ అభివృద్ధి చేస్తామంటూ ఎవరైనా వచ్చి విరాళాలు అడిగితే ప్రజలు నమ్మవద్దని తమకై తాము విరాళాం అడిగితే సమ్మతమైతేనే ఇవ్వవచ్చునన్నారు.మండల ప్రజలు ఆలయ అభివృద్ధికి భక్తులుఇచ్చు విరాళామైతే తమను సంప్రదించాలనిఅన్నదానానికి ఇచ్చే విరాళాం అయితే ఆలయానికి గాని ఆర్చకులకు గాని ఎటువంటి సంబంధం లేదని తెలిపారు.